క్లుప్తంగా

ఎక్సైజ్ సీఐగా రవిచంద్ర బాధ్యతల స్వీకరణ


ఉరవకొండ ఎక్సైజ్ సీఐ రవిచంద్ర

ఉరవకొండ: ఉరవకొండ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐగా రవిచంద్ర సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం డీసీ కార్యాలయం నుంచి ఉరవకొండకు బదిలీపై రవిచంద్ర వచ్చారు.

ఆర్‌డబ్ల్యూఎస్ జేఈగా నాగదివ్య బాధ్యతల స్వీకరణ


ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగదివ్య

కూడేరు: మండల ఆర్‌డబ్ల్యూఎస్ జేఈగా నాగదివ్య నియమితులయ్యారు. సోమవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈమె అనంతపురం ఆర్‌డబ్ల్యూఎస్ ప్రధాన కార్యాలయం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఫాతిమా గుంతకల్లుకు బదిలీపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత జేఈ విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉండి, గ్రామాల్లో నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

కూడేరు మండల పీఆర్ ఏఈగా రమణయ్య


పీఆర్ ఏఈ రమణయ్య

కూడేరు: మండల పంచాయతీ రాజ్ ఏఈగా రమణయ్య నియమితులయ్యారు. సోమవారం ఆయన ఏఈగా బాధ్యతలు చేపట్టారు. ఈయన శ్రీ సత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న శ్రీనివాసులు గార్లదిన్నె మండలానికి బదిలీపై వెళ్లారు. నూతన ఏఈకి పీఆర్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు, పంచాయతీ కార్యదర్శులు పుష్పం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

పీఆర్ ఇంజనీర్‌గా రవీంద్ర

ఉరవకొండ: ఉరవకొండ పంచాయతీరాజ్ మండల ఇంజనీర్‌గా రవీంద్ర సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ముదిగుబ్బ మండలం నుంచి రవీంద్ర బదిలీపై ఉరవకొండకు వచ్చారు. గతంలో ఇక్కడ ఇంజనీర్‌గా పనిచేస్తున్న మధుసూదన్ ఉద్యోగ విరమణ చేశారు.

దుర్గం ఎస్ఐగా బాలరాజు


ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన బాలరాజు

రాయదుర్గం: రాయదుర్గం అర్బన్ పీఎస్ ఎస్ఐగా బాలరాజు సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతపురం డీటీసీ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చినట్టు ఆయన తెలిపారు.

ఇన్‌చార్జ్ ఆర్‌డీఓగా వినూత్న


రెవెన్యూ అధికారులతో సమావేశంలో పాల్గొన్న ఇన్‌చార్జ్ ఆర్‌డీఓ వినూత్న

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం ఇన్‌చార్జ్ ఆర్‌డీఓగా వినూత్న సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న రాణీసుస్మిత బదిలీపై వెళ్లారు. ఇన్‌చార్జ్ ఆర్‌డీవో బొల్లిపల్లి వినూత్న (ఐఏఎస్)కు ఆర్‌డీఓ కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు.

దళితులపై వివక్ష తగదు

కళ్యాణదుర్గం: దళిత, గిరిజనుల పట్ల మున్సిపల్ కమిషనర్ వివక్ష తగదని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ నాయకులు అన్నారు. మున్సిపల్ కమిషనర్ వంశీ కృష్ణ భార్గవ్ వ్యవహార శైలిని నిరసిస్తూ తొలగించిన మున్సిపల్ కార్మికులతో కలిసి ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ సోమవారం నిరసన తెలియజేశారు. జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి ఆధ్వర్యంలో స్థానిక బాబు జగ్జీవన్ రాం విగ్రహం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. అనంతరం అనంతపురం ప్రధాన రహదారిపై బైఠాయించి, నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు చెలిమప్ప, దొణితిమ్మప్ప, డాబా రమేష్, భాస్కర్ నాయక్, గంగప్ప, గోపాల్, రామచంద్ర, నరసింహులు, శ్రీరాములు, లక్ష్మిదేవి, వేదావతి, బాలు, శివ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల చేయూత


శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బెళుగుప్ప: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ అభివృద్ధికి పూర్వ విద్యార్థులు తమ వంతుగా తోడ్పాటునందించారు. పాఠశాలలో 1984–85 బ్యాచ్ విద్యార్థులు రూ.25వేలు వెచ్చించి నేమ్‌బోర్డు, ఫెన్సింగ్ ఏర్పాటు చేయించారు. నేమకల్లు ఉన్నత పాఠశాల హెచ్ఎం బెళుగుప్పకు చెందిన పుట్లూరు శ్రీనివాసరెడ్డి 'బడి రుణం తీర్చుకుందాం' కార్యక్రమానికి రూ.10వేలు ఇచ్చారు.దీంతో ఆయన్ను హెచ్ఎం వెంకటప్రసాద్, ఉపాధ్యాయులు సన్మానించారు.

ఈ దందాను ఏమందురో..?



కర్ణాటక సరిహద్దులో ఉన్న రాయదుర్గం, ఉరవకొండలో మెడికల్ దందా జోరుగా సాగుతోంది. ప్రైవేట్ వైద్యులు, ఆర్ఎంపీలు పేదల రక్తాన్ని జుర్రేస్తున్నారు. రోగాన్నిబట్టి అందినకాడికి గుంజుకుంటున్నారు. అనుమతి లేకుండా ఆస్పత్రులు, ల్యాబ్‌లు ఏర్పాటు చేసి,అనుభవం లేకున్నా వైద్యులుగా చెలామణి అవుతూ దోపిడీ చేస్తున్నారు. రాయదుర్గంలో అనధికారిక ఆస్పత్రులు ఏర్పాటు చేసి, మొలలు, ఆర్థో, సర్జికల్, రక్త పరీక్షలు, డయాగ్నస్టిక్ కేంద్రాలు మొదలు..అన్ని రకాల జబ్బులకు వైద్యం అందిస్తున్నట్లు పెద్ద హోర్డింగులు ఏర్పాటు చేస్తే.. ఉరవకొండలో మాత్రం మరో రకం దందా చేస్తున్నారు. నిబంధనలు పాటించకుండా మెడికల్ దుకాణాలను నిర్వహిస్తున్నారు. డాక్టర్ చీటీ లేకుండా మందులూ విక్రయిస్తున్నారు. ఫార్మసిస్టులు లేని దుకాణాలే అధికంగా ఉన్నాయి. కొన్ని షాపుల్లో కాలం చెల్లిన మందులు, విచ్చలవిడిగా అబార్షన్ కిట్లు అమ్ముతున్నారని జనం బహిరంగంగా చర్చించుకుంటున్నారు. డ్రగ్స్ అధికారులు నెలవారీ మామూళ్లు పుచ్చుకుంటూ తనిఖీలకు స్వస్తి చెప్పారనే ఆరోపణలూ వినిపిస్తున్నాయి.

– రాయదుర్గం/ఉరవకొండ:

- పేదల రక్తాన్ని జుర్రేస్తున్న ప్రైవేట్ వైద్యులు
- పుట్టుకొస్తున్న ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్‌లు
- అనుభవం లేకున్నా వైద్యులుగా చెలామణి
- ఉరవకొండలో నిబంధనలు పాటించని మెడికల్ షాపు నిర్వాహకులు
- ఫార్మసిస్టులు లేని దుకాణాలే అధికం
- డాక్టర్ చీటీ లేకుండానే మందుల విక్రయాలు
- విచ్చలవిడిగా అబార్షన్ కిట్ల విక్రయాలు





డీఎంహెచ్ఓ తనిఖీకి రావడంతో రాయదుర్గంలో తలుపులు మూసిన మొలల ఆస్పత్రి (ఫైల్), రాయదుర్గంలోని బళ్లారి రోడ్డులోని ఐస్‌క్రీం డాక్టర్ క్లినిక్‌ను సీజ్ చేస్తున్న డీఎంహెచ్ఓ (ఫైల్)

రాయదుర్గం పట్టణ వ్యాప్తంగా ప్రైవేట్ క్లినిక్‌లు, ఆస్పత్రులు సుమారు యాభైకు పైగా వెలిశాయి. బళ్లారి రోడ్డు, కణేకల్లు, దాసప్పరోడ్డు, పాతబస్టాండ్, అనంతపురం రోడ్డు తదితర ప్రాంతాల్లో ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు, రక్త పరీక్షల కేంద్రాలు వెలిశాయి. వైద్యుడిని దేవుడితో సమానంగా చూస్తారు.. కళ్లముందు కనిపించే దేవుడు అంటారు.. అంతటి గౌరవానికి మచ్చతెచ్చేలా వైద్యులు, ఆర్ఎంపీల ముసుగులో కొందరు వ్యవహరిస్తున్నారు. పదో తరగతి చదివిన కొందరు ఎంబీబీఎస్‌లుగా చెలామణి అవుతూ పేదల జీవితాలతో చలగాటమాడుతున్నారు. పేరుకు 'ప్రాథమిక వైద్యం' బోర్డు పెట్టి లోపల ఎంబీబీఎస్ డాక్టర్ తరహా బెడ్లు (మంచాలు) ఏర్పాటు చేసి వైద్యం అందిస్తున్నారు. దీనిపై కొందరు సీనియర్ ఆర్ఎంపీలు ఇటీవల డీఎంఅండ్‌హెచ్ దృష్టికి తీసుకెళ్లారు. వారిపై చర్యలు చేపట్టాలని కోరారు. అలాంటి వారితో అసలుకే సమస్య వస్తోందని తెలిపారు. కొందరి పేర్లు కూడా వారే తెలియజేశారు. పల్లెల్లోనూ ఈ వ్యాపారం జోరందుకుంది. యథేచ్ఛగా సెలైన్ బాటిళ్లు, ఇంజెక్షన్లు వేస్తూ, దోపిడీ పర్వం సాగిస్తున్నారు. ఆస్పత్రులు, ఆర్ఎంపీల క్లినిక్‌లలో తనిఖీలు చేసి, తెరవెనుక మంత్రాంగం జరపకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఇటీవల డీఎంహెచ్ఓ తనిఖీ..

రాయదుర్గంలో మెడికల్ దందా వ్యవహారంపై డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవికి ప్రజల నుంచి ఫిర్యాదులు అందాయి. ఇటీవల డెమో త్యాగరాజు, డిప్యూటీ హెచ్ఈఓ గంగాధర, స్థానిక వైద్యులు, సిబ్బందితో కలసి పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్‌లలో విస్తృతంగా తనిఖీలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న కేర్ షైనిక్ (ఐస్‌క్రీమ్ డాక్టర్), మోసిద్దీన్, ఎండీ ఫైల్స్, బిస్వాస్ ఫైల్స్ క్లినిక్‌లు, ఆస్పత్రులను సీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. తనిఖీలు చేస్తున్నట్లు తెలియగానే చాలా మంది ఆస్పత్రులు, క్లినిక్‌లకు తలుపులు మూసి పారిపోయారు. నెలరోజుల క్రితం నిర్వహించిన తనిఖీల్లోనూ ఏడుగురికి నోటీసులు ఇచ్చారు. మళ్లీ ఇప్పుడు నోటీసులు అందుకున్న వారిలో పాతవారు ఉండడం గమనార్హం.

ప్రజల ప్రాణాలతో చెలగాటం..

ఉరవకొండ నియోజకవర్గంలో 30 మెడికల్ షాపులు ఉండగా, ఇందులో 80 శాతం వరకు ఫార్మసిస్టులు లేని షాపులు ఉన్నాయి. ఎక్కడైనా ఆసుపత్రి ఏర్పాటు చేస్తున్నారంటే దానికి అనుబంధంగా మెడికల్ షాపు ఏర్పాటుకు రూ.లక్షలు గుడ్‌విల్ ఇచ్చేందుకు వెనుకాడం లేదు. మందుల దుకాణాల్లో రోజు రూ.లక్షలు వ్యాపారం జరుగుతుండడంతో ఆస్పత్రి యాజమాన్యం సొంతంగా మందుల దుకాణాలు నిర్వహిస్తున్నారు.

విచ్చలవిడిగా నిషేధిత మందుల విక్రయాలు..

ఉరవకొండలో క్లాక్‌టవర్ సమీపంలో ఉన్న మెడికల్ షాపుల్లో విచ్చలవిడిగా అబార్షన్ కిట్లు ఎలాంటి ప్రిస్క్రిప్షన్ లేకున్నా విక్రయిస్తున్నారు. గతంలో డ్రగ్స్ అధికారుల దాడుల్లో పలు షాపుల్లో వీటిని విక్రయిస్తున్నట్లు గుర్తించారు. దీంతో పాటు ఆనాక్సిట్ (నిద్ర మాత్రలు) డాక్టర్ చీటీ లేకుండానే అమ్ముతున్నారు. గతంలో ఉరవకొండలో డ్రగ్స్ అధికారులు నిర్వహించిన దాడుల్లో కాలం చెల్లిన మందులు విక్రయించడం వల్ల కొన్ని మెడికల్ షాపులను సీజ్ చేశారు. దీంతో పాటు కాలం చెల్లిన మాత్రలను సీజ్ చేశారు. ఇంత పెద్ద ఎత్తున మెడికల్ షాపుల్లో దోపిడీ జరుగుతున్నా అధికారులు మాత్రం మామూళ్లు పుచ్చుకుంటూ తూతూ మంత్రంగా దాడి చేసి, వదిలేస్తున్నారు.

కాలం చెల్లిన మాత్రలు ఎమ్మార్పీకి విక్రయం: కొన్ని దుకాణాల్లో మెడికల్ ఏజెన్సీల దగ్గర కాలం చెల్లిన మాత్రలు అతి తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎమ్మార్పీకే విక్రయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఉరవకొండలోని 90 శాతం షాపుల్లో ఇదే తరహా వ్యాపారం సాగుతోంది. వ్యాపారులు మాత్రల స్ట్రిప్స్‌లో కాలం చెల్లిన తేదీ ఉన్న భాగాన్ని తొలగించి, విక్రయిస్తున్నారని తెలుస్తోంది. అధికారులు పకడ్బందీగా దాడులు చేస్తే ఇలాంటి ఎక్స్‌పైరీ వ్యవహారాలు బయటపడతాయి. డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణ లేక కొందరు స్వార్థపరులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతు రూ.లక్షల్లో వ్యాపారం చేస్తున్నారు.


ఉరవకొండలో కాలం చెల్లిన మాత్రలు విక్రయించడంతో మూతపడిన మెడికల్ షాపు



ఉరవకొండలో విక్రయిస్తున్న అబార్షన్ కిట్లు



డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా విక్రయిస్తున్న నిద్రమాత్రలు

ప్రతి కేంద్రాన్నీ తనిఖీ చేస్తాం



రాయదుర్గంలో ప్రైవేట్ ఆస్పత్రులు, ఆర్ఎంపీల వైద్యంపై ప్రత్యేక నిఘా ఉంచాం. ఇప్పటికే వరుసగా దాడులు చేస్తున్నాం. గత నెలలో ఏడు క్లినిక్‌లకు నోటీసులు ఇచ్చి, సీజ్ చేశాం. ఇటీవల మరో నాలుగు క్లినిక్‌లు సీజ్ చేశాం. త్వరలో తనిఖీలు చేసి, నిబంధనలకు విరుద్ధంగా వైద్యం అందించేవారిపై చర్యలు తీసుకుంటాం. అనుభవంలేని వారు కూడా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఈ సారి పట్టుబడితే కేసులు నమోదు చేయిస్తాం. ప్రజలు ప్రభుత్వాస్పత్రుల్లో అందుతున్న మెరుగైన వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలి. అనుభవం లేని ఆర్ఎంపీలతో వైద్యం చేయించుకుని ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దు.

– ఈబీ దేవీ, డీఎంఅండ్‌హెచ్ఓ, అనంతపురం

మెడికల్ షాపులపై దాడులు చేస్తాం

ఉరవకొండలోని మెడికల్ షాపుల్లో జరుగుతున్న దందాపై చర్యలు తీసుకుంటాం. షాపుల్లో విస్తృతంగా తనిఖీలు చేసి, కాలం చెల్లిన మాత్రలు ఉంటే సీజ్ చేస్తాం. అబార్షన్ కిట్లు ఎక్కడా విక్రయించడానికి లేదు. గతంలో అలా విక్రయిస్తున్న షాపు నిర్వాహకులపై చర్యలు తీసుకున్నాం.

– రమేష్‌రెడ్డి, ఇన్‌చార్జ్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్

బాబూ..సూపర్ సిక్స్ అమలు చేసేదెన్నడు?

కూడేరు: అధికారంలోకొస్తే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని చెప్పి, నేటికీ పట్టించుకోలేదని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ ధ్వజమెత్తారు. సోమవారం రాత్రి పి.నారాయణపురంలో సీపీఐ ఆధ్వర్యంలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో రైతులు, ప్రజలను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జాఫర్ మాట్లాడారు. వర్షాభావంతో ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుశనగ, కంది, ఆముదం పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. ప్రభుత్వం పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు పరిహారం అందించి, ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మైక్రో ఇరిగేషన్ పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతులను ఆదుకోవాలన్నారు. సీపీఐ, అనుబంధ సంఘాల నాయకులు మల్లికార్జున, పార్వతి ప్రసాద్, ఆకులేటి మల్లికార్జున, వరప్రసాద్, మలరాయుడు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్

హోరాహోరీగా క్రీడాపోటీలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలు సోమవారం హోరాహోరీగా కొనసాగాయి. ఇటీవల మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో విజేతలు ఎంపిక కాగా, సోమవారం నుంచి నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కౌన్సిలర్ గౌని లావణ్య, ఎంఈఓ -1 నాగమణి, ఎంఈఓ-2 వెంకట రమేష్ హాజరై క్రీడలను ప్రారంభించారు. బాలికలు, బాలుర విభాగాల్లో పీఈటీలు పోటీలు నిర్వహించారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, చెస్ పోటీల్లో జిల్లాస్థాయి పోటీలకు టీమ్‌లను ఎంపిక చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జ్ పొరాళ్ల శివకుమార్, నిజాముద్దీన్, కోఆప్షన్ సభ్యుడు నజీర్, గేమ్స్ కోఆర్డినేటర్లు నాగేంద్ర, రామాంజనేయులు, శివశరణప్ప, పీడీలు రామాంజనేయులు, రాజశేఖర్, మల్లికార్జున, సుధాకర్, ఇస్మాయిల్, జయప్ప, కరెప్ప పాల్గొన్నారు.


పోటీలను లాంఛనంగా ప్రారంభిస్తున్న దృశ్యం

సిఫార్సు బదిలీలను వెంటనే ఆపాలి

కళ్యాణదుర్గం: సిఫార్సు బదిలీలకు, అక్రమ పద్ధతిలో బదిలీలను వెంటనే ఆపాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి.పాతిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మండలంలోని స్థానిక మల్లికార్జునపల్లి ఉన్నత పాఠశాలలో సమావేశం ఏర్పాటు చేశారు. పాతిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు 650 బదిలీలను సిద్ధం చేయగా, ఎన్నికల కోడ్‌తో నిలిచిపోయాయని గుర్తు చేశారు. జిల్లా కార్యదర్శి నరేష్ కుమార్, హెచ్ఎం మల్లికార్జున, సీనియర్ నాయకులు గోవర్ధన్, వెంకటేశులు, నారాయణ పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి


అవగాహన కల్పిస్తున్న మాస్ ఎడ్యుకేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ నీలకంఠ, ఐసీటీసీ కౌన్సిలర్ కృష్ణమూర్తి

రాయదుర్గంటౌన్: ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే హెచ్ఐవీ, ఎయిడ్స్, సుఖవ్యాధులు, టీబీ నిర్మూలించొచ్చని మాస్ ఎడ్యుకేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ నీలకంఠ, ఐసీటీసీ కౌన్సిలర్ కృష్ణమూర్తి తెలిపారు. సోమవారం పట్టణంలోని శ్రీవెంకటేశ్వర జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు అధ్యక్షతన వైద్య ఆరోగ్యశాఖ, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, మాస్ ఎడ్యుకేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్ఐవీ ఎయిడ్స్ యాక్ట్ 2017, ఏఆర్‌టీ మందులు, ఏపీఎస్ఏసీఎస్ యాప్, టోల్ ఫ్రీ నంబర్ 1097 గురించి తెలియజేశారు.

కార్మికులకు సన్మానం


పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న దృశ్యం

కూడేరు: కూడేరులోని సచివాలయం-1 వద్ద మండలంలోని పారిశుధ్య కార్మికులు, డప్పు కళాకారులను సర్పంచులు, అధికారులు సోమవారం సన్మానించారు. వారు మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా వీరి సేవలను గుర్తించి, సన్మానించినట్లు సర్పంచులు, అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ లక్ష్మీనరసమ్మ, పీఆర్ ఏఈ రమణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగ దివ్య , పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ధరలు తగ్గించడంలో విఫలం

ఉరవకొండ: నిత్యావసర ధరలు తగ్గించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఎం నాయకులు అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. సీపీఎం నాయకులు మధుసూదన్, రంగారెడ్డి, జ్ఞానమూర్తి మాట్లాడారు. నిత్యావసరాలు, పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గించడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. తహసీల్దార్ మహబూబ్‌బాషాకు వినతి పత్రం అందించారు.

ఇద్దరిపై కేసు నమోదు

కళ్యాణదుర్గం రూరల్: బోరంపల్లిలో రస్తా విషయంలో అన్నదమ్ముల మధ్య ఘర్షణ జరిగింది. కాడప్ప, ఆంజనేయులు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ ఘర్షణలో ఇద్దరూ గాయపడ్డారు. ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవటంతో కాడప్ప, అంజనేయులుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు సోమవారం తెలిపారు.

అప్రమత్తత అవసరం

కంబదూరు: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి ఆసియా అన్నారు. సోమవారం మండలంలోని జెక్కిరెడ్డిపల్లి గ్రామంలో 104 వాహనం ద్వారా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. డాక్టర్ ఆసియా గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీసీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు.

సంక్షిప్త సమాచారం

బాల్య వివాహాలపై అవగాహన

విడపనకల్లు: విడపనకల్లు ఎంపీడీఓ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ఎంపీడీఓ శ్రీనివాసులు ,ఈఓఆర్డీ సత్యబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అర్జీ పరిష్కరిస్తాం

కంబదూరు: ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి అర్జీనీ పరిష్కరిస్తామని తహసీల్దార్ బాలకిషన్ తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)ను నిర్వహించారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా వెలిగొండ ఓబన్న

ఉరవకొండ: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) జిల్లా ఉపాధ్యక్షుడిగా వెలిగొండ ఓబన్న నియమితులయ్యాడు. సోమవారం నియామక ఉత్తర్వులను ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పూర్వ జిల్లా అధ్యక్షుడు రాజు నుంచి అందుకున్నాడు.

వరద బాధితులకు విరాళాల సేకరణ

కూడేరు: మండల కేంద్రంలో విజయవాడ వరద బాధితుల కోసం సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ తరుపున అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో సోమవారం విరాళాలు సేకరించారు. ఏఐకేఎంఎస్ జిల్లా కోశాధికారి రాయుడు మాట్లాడారు. వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు సంజప్ప, అరుణోదయ సాంస్కృతి సమైఖ్య రాజేష్, నాయకులు పాల్గొన్నారు.

ఉరవకొండ: విజయవాడ వరద బాధితుల కోసం సెంట్రల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రూ. 2,388 సేకరించి తహసీల్దార్ మహబూబ్ బాషాకు సోమవారం అందించినట్లు హెచ్ఎం హనీఫ్, ఉపాధ్యాయులు వెంకట్‌తాడికొండ తెలిపారు.

విలేకరిపై దాడి

కుందుర్పి: మండలంలో పనిచేస్తున్న విలేకరి డిస్ తిమ్మప్పపై అప్పిలేపల్లికి చెందిన హనుమంతరాయుడు దాడి చేసినట్లు బాధితుడు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశాడు.

విద్యార్థులకు క్రీడాదుస్తులు వితరణ

వజ్రకరూరు: మండలంలోని చిన్నహోతూరులో విద్యార్థులకు గడేహోతూరు సర్పంచు సురేంద్ర, పార్వతి దంపతులు క్రీడాదుస్తులను సోమవారం పంపిణీ చేశారు. హెచ్ఎం బసవలింగప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో మరింత రాణించాలన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకర్, ఉపాధ్యాయులు నాగరాజు, మునీంద్ర, మస్తాన్‌వలి, మల్లికార్జున, నారాయణస్వామి, రజనికుమారి, కృష్ణ, సుభాష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక


రసవత్తరంగా సాగుతున్న క్రీడాపోటీలు

కళ్యాణదుర్గం రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అండర్ 14, 17 విభాగంలో పోటీలు నిర్వహించినట్లు స్పోర్ట్స్ కోఆర్డినేటర్ చల్లా కిరణ్ చౌదరి తెలిపారు. సోమవారం పట్టణంలోని కరణం చిక్కప్ప ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో క్రీడాపోటీలు నిర్వహించారు. కళ్యాణదుర్గం నియోజకర్గానికి చెందిన సూమారుగా 600 మందికిపైగా బాల, బాలికల క్రీడాకారులు పాల్గొన్నారు. కరణం చిక్కప్ప ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంధం శ్రీనివాసులు, ఆనంద్ రెడ్డి, చల్లా కిషోర్, బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలపై వినతులు

విడపనకల్లు: మండల కేంద్రంలో తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో రైతులు పలు సమస్యలను అధికారులకు విన్నవించారు.అర్జీల రూపంలో అధికారులకు అందించారు. గడేకల్లు, హావళిగి, కరకముక్కల, డొనేకల్లు, పాలికల గ్రామాల రైతులు సమస్యలు విన్నవించారు.

వ్యర్థాలతో కళాకృతులు

కుందుర్పి: స్థానిక కేజీబీవీ విద్యార్థినులు చెత్తకేంద్రాల నుంచి సేకరించిన గాజుగ్లాసులు, ప్లాస్టిక్ వస్తువులతో వివిధ రకాల కళాకృతులను తయారు చేశారు. ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఓ నిర్మల, పంచాయతీ కార్యదర్శులు బాషా, స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి ఆలయాభివృద్ధికి కృషి

విడపనకల్లు: మండలంలోని ప్రసిద్ధి చెందిన ఉండబండ వీరభద్రస్వామి ఆలయ అభివృద్ధికి తనవంతుకు కృషి చేస్తానని ఈఓ విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం ఉండబండ వీరభద్రస్వామి ఆలయ ఈఓ బాధ్యతలు స్వీకరించారు. నూతన ఈఓ విజయ్‌కుమార్‌కు దేవదాయ శాఖ సిబ్బంది లీలావతి, పురుషోత్తం, మంజునాథ్, శుభాకాంక్షలు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత

కుందుర్పి: మండల కేంద్రంలో సర్పంచు మారుతేశ్వరి ఆధ్వర్యంలో సోమవారం పరిసరాలను శుభ్రం చేయించారు. ఇటీవల మండల కేంద్రంలో పారిశుధ్యం లోపించి, ప్రజలు జ్వరాల బారిన పడ్డారు.

పిల్లలను ఉన్నతంగా చదివించాలి

బెళుగుప్ప: తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నతంగా చదివించాలని తహసీల్దార్ షర్మిళ, ఎస్ఐ శివ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో వివిధశాఖల అధికారులతో కలిసి పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఓ ఎర్రిస్వామి, కాలనీవాసులు నారాయణస్వామి, సూర్యనారాయణ, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పౌష్టికాహార మాసోత్సవాలు

వజ్రకరూరు: మండల కేంద్రంలోని ఒకటో అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో పౌష్టికాహార మాసోత్సవాలను సోమవారం నిర్వహించారు. గ్రామ వీధుల గుండా ర్యాలీ చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి మాట్లాడుతూ పౌష్టికాహార మాసోత్సవాలు సోమవారంతో ముగిసినట్లు తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తులసి, సునీత, ఏఎన్ఎం సుకన్య, ఆశా కార్యకర్త మేరీ, చిన్నారుల తల్లులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చీనీ చెట్లు దగ్ధం

కూడేరు: మండలంలోని గొటుకూరులో రైతు కేసీ వెంకటరాముడుకు చెందిన పది చీనీ చెట్లు సోమవారం తెల్లవారుజామున దగ్ధమయ్యాయి. ప్రధాన విద్యుత్‌లైన్ నుంచి విద్యుత్ తీగలు తెగిపడి మంటలు చెలరేగాయి.

అపరిశుభ్రత తొలగింపు

బ్రహ్మసముద్రం : మండలంలోని నాగిరెడ్డిపల్లి , వేపులపర్తి గ్రామాల్లో రోడ్లపై నిలిచిన మురుగు నీరును కాలువల ద్వారా మళ్లించి, అపరిశుభ్రత తొలగించారు. అనంతరం స్థానికులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈఓఆర్డీ వెంకట్‌నాయుడు, ఏఓ నందకిశోర్ , సీనియర్ అసిస్టెంట్ అచ్యుతానంద, పంచాయతీ కార్యదర్శులు సత్యమ్మ, మురళి, మంజుళ పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక

రాయదుర్గంటౌన్: ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం జరిగిన ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో వివిధ మండలాల క్రీడాకారులు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. దాదాపు వంద టీమ్‌లు హాజరుకాగా, అండర్ 14, అండర్ 17 విభాగాల్లో బాలుర, బాలికలకు వాలీబాల్, ఖోఖో, యోగ, చెస్ విభాగాల్లో పోటీలు జరిగినట్లు కోఆర్డినేటర్ నాగేంద్ర తెలిపారు. అండర్ 14 బాలుర విభాగంలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు డి.హీరేహాళ్ టీమ్, బాలికల విభాగంలో గుమ్మఘట్ట టీమ్ విజేతలుగా నిలిచినట్లు చెప్పారు. అండర్ 17 బాలుర విభాగంలో కణేకల్లు జట్టు, బాలికల విభాగంలో గుమ్మఘట్ట జట్టు ఎంపికైనట్లు చెప్పారు. కబడ్డీలో అండర్ 14 బాలికల బాలుర విభాగంలో కణేకల్లు టీమ్, బాలికల విభాగంలో డి.హీరేహాళ్ టీమ్ విజేతగా నిలిచినట్లు తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

కుందుర్పి: మండలంలోని ఎనుములదొడ్డి గ్రామ సమీపంలో పేకాట స్థావరంపై స్థానిక పోలీసులు సోమవారం దాడులు చేశారు. 9 మందిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.23,510 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌చార్జ్ ఎస్ఐ రాంభూపాల్ తెలిపారు.